# అనుకున్నదొక్కటి

కోపూరి పుష్పాదేవి

"హలో రజనీ అక్కా... బాగున్నారా...?" ఫోన్‌లో సరిత స్వరం ఆప్యాయంగా అడిగింది.

పిల్లల అల్లరితో విసిగి ఉన్న రజనికి ఆ స్వరం మండుటెండలో మలయమారుతంలా అనిపించింది. "బాగున్నామమ్మా... ఏమిటి విశేషాలు...? చాలా రోజులయింది నీతో మాట్లాడి... అమ్మా నాన్నా, అక్కా బావా అందరూ బాగున్నారు గదా...?"

"అందరం బాగున్నామక్కా... మమతక్కకు బాబు పుట్టాడు".

"అబ్బో... పెద్ద విశేషమే. చెప్పవేం మరి?"

"అది చెబుదామనే ఫోన్ చేసానక్కా ... ఎల్లుండి బారసాల. నామకరణం, నూతిలో చేద... అన్నీ ఉన్నాయి. నువ్వూ, చిన్నక్కా బావగార్లూ, పిల్లలూ



అందరూ రావాలి. చిన్నక్క లేదా ఇంట్లో...?" అడిగింది సరిత.

"సునంద స్కూలుకి వెళ్లింది. నేను చెబుతాలే తనతో"

"అక్కా మీరందరూ తప్పకుండా రావాలని అమ్మానాన్నా మరీ మరీ చెప్పమని చెప్పారు. తప్పకుండా రండక్కా... ఉంటాను మరి..." ఫోను పెట్టేసింది సరిత.

రజని, సునంద తోడికోడళ్లు. సునంద తాలూకా హైస్కూల్లో లెక్కలు టీచర్‌గా పని చేస్తోంది. వాళ్లది ఉమ్మడి కుటుంబం. అన్నదమ్ములిద్దరూ కలిసి బియ్యం వ్యాపారం చేస్తారు. పది సంవత్సరాల క్రితం వీళ్ల ఇంట్లో సుందర్రామయ్యగారి కుటుంబం అద్దెకు ఉండేవాళ్లు. వాళ్లది బీద సంసారం. ఆయనకు మమత, సరిత ఇద్దరే కూతుళ్లు. భార్య ఇందుమతి. ఆయన లారీ ట్రాన్స్‌పోర్ట్ ఆఫీసులో గుమస్తాగా పనిచేసేవాడు. రాబడి తక్కువయినా పొదుపుగా, గుంభనగా సంసారాన్ని లాక్కువచ్చేది ఇందుమతి.

వాళ్లూ, వీళ్లూ అందరూ మంచివాళ్లు కావడంతో పాలూ, పంచదారలా కలిసిపోయారు. మమతకు వీళ్ల ఇంట్లో ఉన్నప్పుడే పెళ్లయింది. కానీ నాలుగయిదేళ్లు గడిచినా ఆమెకు పిల్లలు పుట్టలేదు.

రజనీ వాళ్లకు కుటుంబ సభ్యులు పెరగడంతో గదులు అవసరం వచ్చి తప్పని పరిస్థితుల్లో సుందర్రామయ్యగారిచేత ఇల్లు ఖాళీ చేయించారు. అవసరానికి తప్పక అలా చేయవలసివచ్చింది గానీ దూరమవుతున్నందుకు రెండుకుటుంబాల వారికీ ఒక పొదులో కొమ్మను నరికి, వేరు చేసినంత బాధ కలిగింది.

తరువాత కూడా కొత్తలో రెండిళ్లు మధ్యా రాకపోకలు బాగానే జరిగేవి. ఎందుకనో సుందర్రామయ్యగారు ప్రక్కనున్న మంగళగిరికి వెళ్లిపోవడంతో రెండిళ్ల మధ్యా రాకపోకలు తగ్గిపోయాయి.

రజనికి అప్పటి రోజులు గుర్తొచ్చాయి. తమ రెండు కుటుంబాలూ ఎలా కలిసిమెలిసి ఉండేవాళ్లో... ప్రేమా ఆప్యాయతలు ఎలా ఇచ్చిపుచ్చుకునేవాళ్లో జ్ఞప్తికి వచ్చి ఆమె మనసు పురివిప్పిన నెమలిలా నాట్యం చేసింది. "ఆ బారసాల ఫంక్షన్‌కి తను తప్పకుండా వెళ్లాలి. సుందర్రామయ్య బాబాయిని, ఇందుమతి పిన్నిని, సరితని, మమతనీ అందరినీ చూడాలీ..." అలా గట్టి నిర్ణయం తీసుకున్నాకగానీ రజని మనసు శాంతించలేదు.

అంతలో ఆ వీధి చివర ఉండే గోవిందరావు గారి కూతురూ, అల్లుడూ వచ్చారు, వాళ్లింట్లో ఫంక్షన్‌కి పిలవడానికి. 'మా వదినకు ఎల్లుండి సీమంతం. వాళ్ల పుట్టింటివాళ్లు, మేమూ కలిసి హోటల్ డి.వి. మేనర్‌లో చేస్తున్నాం. మీరందరూ తప్పక రావాలి' పాఠం అప్పజెప్పినట్టు చెప్పి క్షణంలో మాయమయ్యారు వాళ్లు.

"అబ్బో... గోవిందరావు గారింట్లో ఫంక్షనా ...! ఎంత బ్రహ్మాండంగా ఉంటుందో... గోవిందరావుగారే అపరకుబేరుడనుకుంటే... వాళ్ల వియ్యంకుడు ఆ కుబేరుడినే కొనగల సంపన్నుడు. ఇక వాళ్లిద్దరూ కలిసి ఫంక్షనంటే రాజుగారి వివాహమల్లే ఎంత వైభవంగా ఉంటుందో... అయ్యో... రెండు ఫంక్షన్లూ ఒకేసారి వచ్చాయే... ఎలా...? ఎలా...? రజని మనసు చురుగ్గా ఆలోచించింది. సుందర్రామయ్య బాబాయి గారింటికి తర్వాత ఎప్పుడైనా వెళ్లిరావచ్చు.

ఈ బారసాలకు సునందను మాయచేసి మంగళగిరి పంపి, నేను గోవిందరావు గారి

ఫంక్షన్‌కి వెళతాను...” రాజకీయ నాయకుడు పార్టీ మార్చినంత సులభంగా తన నిర్ణయం మార్చుకుని స్థిమితపడింది రజని. వాళ్లింట్లో మగవాళ్లు వ్యాపార పనుల వత్తిడి వల్ల ఎంతో ముఖ్యమయిన వారింట్లో శుభకార్యాలకు మాత్రమే వెళ్తారు. అందువల్ల తోడికోడళ్లే మిగిలిన కార్యాలు చక్కబెడుతుంటారు.

అనుకున్నట్లుగానే కొన్ని అబద్ధాలతో సునందను మంగళగిరి పంపి, తను ఆర్భాటంగా తయారై డి.వి. మేనర్‌కు బయలుదేరింది రజని. ఆటోకి యాభైరూపాయలు ఫేర్ చెల్లించి ఫంక్షన్ హాల్లోకి నడిచింది. అందంగా అలంకరించుకున్న ముగ్గురమ్మాయిలు గుమ్మంలోనే పసుపూ, కుంకుమా, గంధమూ ఇచ్చారు. అవి అందుకుని లోపలకు వెళ్లింది. వేదిక వైభోగంతో అలరారుతోంది. విద్యుద్దీపాలు జిగేల్మంటున్నాయి. వాటికి పోటీగా స్త్రీల ఆభరణాలు తళుక్కు మంటున్నాయి. వెయ్యి సీటింగ్ గల ఆ హాల్లో జనం క్రిక్కిరిసి ఉన్నారు. సీట్లులేక కొందరు నిలబడవలసి వచ్చింది. రజనికీ సీటు దొరకలేదు. అందరూ ఏవేవో మాట్లాడుకుంటూ ఉండటం వల్ల అక్కడంతా రణగొణధ్వనిలా ఉంది. ఎయిర్ కండీషనర్ల చల్లదనం ఏ మూలకూ సరిపోవడం లేదు.

అటుగా వస్తున్న గోవిందరావు గారి భార్య తనను పలకరిస్తుందేమో అనుకుంది రజని. కానీ ఆమె ఎవరితోనో మాట్లాడుతూ చూడనట్లే వెళ్లిపోయింది. రజనికి మనసు చివుక్కుమంది. అందరూ ఎవరిగోల వారిది అన్నట్లున్నారు. కనీసం పలకరించే దిక్కుకూడా లేక, పెద్ద ద్వీపంలో ఏకాకిగా చిక్కుకుపోయినట్లు అనిపించింది రజనికి.

వేదిక మీద సీమంతం చేస్తున్న ఆమెకు పసుపు, కుంకుమా, గాజులు, చీరలు, పళ్లు, స్వీట్లు మొదలైనవి యాభయ్యో, అరవయ్యో పళ్లాలు వియ్యపురాళ్లిద్దరూ పోటీపడి అందిస్తున్నారు. ఆ వెరైటీలు ఏమిటో చూద్దామన్నా వీలుకాకుండా ఇద్దరు ఫొటోగ్రాఫర్లు, ఇద్దరు వీడియో గ్రాఫర్లు స్టేజికి అడ్డంగా నిలబడిపోయారు. వాళ్లవీపులు చూడటమే సరిపోయింది అందరికీ. ఎవరో వచ్చి పండు, తాంబూలం చిన్న ప్లాస్టిక్ బాక్స్ ఉన్న ప్యాకెట్టు పంచిపెట్టారు.

నిలబడి నిలబడి రజనికి విసుగుపుట్టింది. పోనీ భోజనం చేసి వెళ్లిపోదామని డైనింగ్ హాల్‌కి వెళ్లింది. అక్కడా విపరీతమయిన జనం. తోపులాటలుగా ఉంది పరిస్థితి. సూటూ, బూటూ వేసుకున్న ఆధునికులు కూడా అంత అనాగరికంగా ఎలా ప్రవర్తిస్తారో అర్థంకాలేదు రజనికి. ఇక ఆమెకు అక్కడ ఉండబుద్ధికాలేదు. మరో యాభై ఆటోకి చెల్లించుకుని అర్జంటుగా ఇంటికి వచ్చి పడింది... “ఇక్కడికి ఎందుకు వచ్చానురా దేవుడా...” అనుకుంటూ.

ఆపాటికి సునందకూడా మంగళగిరి నుంచి వచ్చేసింది.

“నువ్వు కూడా మంగళగిరి వస్తే చాలా బాగుండేదక్కా... పిన్నీ, బాబాయీ నిన్ను ఎంతగా అడిగారో... మమత అయితే ఒకటే గొడవ... రజని అక్క రాలేదు, బావగార్లూ, పిల్లలూ రాలేదు అంటూ. బాబు చాలా బాగున్నాడు ముద్దుగా బొద్దుగా... ఇదిగో మీరెవరూ రాలేదని పిన్ని ఈ గారెలూ, బూరెలూ పొట్లాలు కట్టి ఇచ్చింది వద్దన్నా వినకుండా. ఆ... ఇక్కడ ఫంక్షన్ బాగా జరిగిందా...” అడిగింది సునంద మెడలో గొలుసు తీసి బీరువాలో పెడుతూ.

“ఆ... ఆ... బాగానే జరిగింది...” కడుపులో ఎలుకలు పరిగెడుతూంటే నీరసంగా జవాబిచ్చింది రజని. ●